# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 17.01.2025 | 24 క్యారెట్లు 78,215.00 | కిలో వెండి 98,000.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:86

www.vishalabharati.com




## దక్షిణ బస్తర్‌లో బుల్లెట్ల వర్షం

- ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి
- ఛత్తీస్‌గఢ్ అడవులను చుట్టుముట్టిన జవాన్లు
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

విశాలభారతి, నేషనల్ బ్యూరో: ఛత్తీస్ గఢ్‌లో మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. గురువారం (జనవరి 16) బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు. అధికారుల వివరాల ప్రకారం.. గురువారం బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయ్యారని ఇంజలిజెన్స్ సమాచారం అందింది. ఇంటలిజెన్స్ సమాచారం మేరకు మూడు జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ , కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్) ఐదు బెటాలియన్లు, సీఆర్పీఎఫ్‌కు చెందిన చెందిన 229వ బెటాలియన్‌తో సహా భద్రతా సిబ్బంది జాయింట్ ఆపరేషన్ చేపట్టింది.

భద్రతా దళాలు జల్లెడ పడుతుండగా ఉదయం 9 గంటల ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. తొలుత భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. వెంటనే రియాక్ట్ అయిన భద్రతా దళాలు ఎదురు కాల్పులు

..మిగతా 2 లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలేవి..?

- సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్
- 4 వారాల్లో నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి

విశాలభారతి, స్టేట్ బ్యూరో: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9 నెలలవుతున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. కడియం



..మిగతా 3 లో

## కేజ్రీవాల్, మోడీ దొందూ దొందే

### వాళ్లిద్దరూ ఢిల్లీకి చేసిందేమీ లేదు

- లిక్కర్ స్కాంలో భాగస్వాములను తెలంగాణలో ఓడించాం
- ప్రధాన పాత్రధారి కేజ్రీవాల్‌నూ ఇంటికి పంపిస్తాం
- ఆరునూరైనా ఎన్నికల హామీలు అమలుచేస్తాం
- ఏడాదిలోనే రాష్ట్రంలో 55వేల ఉద్యోగాలిచ్చాం
- రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశాం
- ఢిల్లీ ఎన్నికల గ్యారెంటీలను ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హామీల అమలు బాధ్యత తనదేనని భరోసా




మద్యం కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న వాళ్లను తెలంగాణలో ఓడించామని, ఇక ప్రధాన భాగస్వామి అర్వింద్ కేజ్రీవాల్‌ను ఓడించడానికి ఇప్పుడు ఢిల్లీకి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ మూడుసార్లు ప్రధాని అయినా, కేజ్రీవాల్ ఢిల్లీకి మూడు సార్లు సీఎం అయినా చేసిందేమీ లేదని విమర్శించారు. పేర్లు వేరయినా వారి చేతలు ఒక్కటేనని అన్నారు.

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఢిల్లీలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ రెండు గ్యారెంటీలను సీఎం రేవంత్ ప్రకటించారు. రూ .500కు గ్యాస్ సిలిండర్, వంట సామగ్రి కిట్ (2 కిలోల పంచదార, లీటర్ వంట నూనె, 6 కిలోల పప్పులు, 250 గ్రాముల టీ పొడి), 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని, అందుకే ఇక్కడ వాగ్దానాలు చేస్తున్నామని

..మిగతా 2 లో



## ఇది తెలంగాణ విజయం..

- బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా
- కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా దక్కే అవకాశం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

..మిగతా 2 లో

## తెలంగాణ వాటా పెరుగుతుందా..?

- కృష్ణా జలాల పున:పంపిణీకి మార్గం సుగమం
- రెండు రాష్ట్రాల మధ్య 1,050 టీఎంసీల పంపిణీకి చాన్స్
- సెక్షన్–3 ప్రకారం వాదనలు వినేందుకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ నిర్ణయం
- తొలుత వాటాలపై కొనసాగనున్న వాదనలు
- అనంతరం ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై నిర్ణయం
- ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: అందుబాటులో ఉన్న కృష్ణా జలాలు మొత్తం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పునఃపంపిణీకి మార్గం ఏర్పడింది. అలాగే తెలంగాణ కోరుతున్న విధంగా ఇప్పటికే వాడకంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదనల దశలో ఉన్న ప్రాజెక్టులకు సైతం నీటి కేటాయింపులను కృష్ణా ట్రిబ్యునల్ పరిశీలించేందుకు అవకాశం చిక్కింది. తొలుత అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్‌డబ్ల్యూడీఏ) 1956లోని సెక్షన్-3 కింద..ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి 2023 అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అదనపు



..మిగతా 2 లో




## చంపి.. పూడ్చేసి.. సమాధిపైనే పిండి వంటలు

- మహబూబాబాద్ జిల్లాలో దారుణం
- స్థానికుల ఫిర్యాదులో వెలుగులోకొచ్చిన ఘటన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: మనుషులు మృగాలుగా మారిపోతున్నారు. ఏమాత్రం భయం లేకుండా హత్యలు చేస్తున్నారు. అనంతరం చేసిన దారుణాలను కప్పిపుచ్చుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. తాజాగా మహబూబాబాద్‌లో అత్యంత కిరాతక ఘటన వెలుగులోకి వచ్చింది. కలకాలం

..మిగతా 2 లో



## బీటెక్ విద్యార్థినిపై రేప్

- హైదరాబాద్ ఇబ్రహీంపట్నంలో దారుణం
- హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న యువతి
- రూమ్‌లోకి చొరబడి అత్యాచారం చేసిన డ్రైవర్
- నిందితుడు నల్లగొండ జిల్లా వాసిగా గుర్తింపు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: అబలలపై రోజు రోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయి. పోలీసులు ఎన్నో విధాలుగా

..మిగతా 2 లో




## రూల్స్ ఎందుకు అతిక్రమించారు..?

- అనుమతి లేకుండా డబ్బులు ఎందుకిచ్చారు..?
- 7 గంటలు నిర్విరామంగా కేటీఆర్‌పై ఈడీ ప్రశ్నల వర్షం
- మాజీ మంత్రికి చెమటలు పట్టించిన అధికారులు
- ఈడీ ఆఫీసు ఎదుట భారీ బందోబస్తు
- ఎన్నిసార్లైనా విచారణకు వస్తా
- లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం
- తప్పు చేశానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- ఏసీబీ ప్రశ్నలనే తిప్పి తిప్పి అడిగారు
- విచారణ అనంతరం కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: కేటీఆర్ ఈడీ విచారణ ముగిసింది. ఫార్ములా ఈకార్ రేస్ ఇష్యూలో దాదాపు 7 గంటల పాటు కేటీఆర్‌ను ఈడీ ప్రశ్నించింది. నగదు బదిలీలకు సంబంధించిన అంశాలపైనే అధికారులు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఉదయం 10.30 గంటలకు ఈడీ కార్యాలానికి చేరకున్న కేటీఆర్‌ను విచారణ బృందం చాలా ప్రశ్నలు అడిగింది. ఏసీబీ నమోదు చేసిన ఈ కేసులోనే ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగానే గురువారం జరిపిన విచారణలో ప్రధానంగా నగదు బదిలీపైనే ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. రూల్స్ పాటించకుండా ఇండియన్ కరెన్సీని పౌండ్లలోకి మార్చి పంపించడం, హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ కంపెనీకి నిధులు

..మిగతా 2 లో



## స్పేడెక్స్ డాకింగ్ సక్సెస్

- చరిత్ర సృష్టించిన ఇస్రో
- నింగిలో విజయవంతంగా ఉపగ్రహాల అనుసంధానం
- ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
17.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# దక్షిణ బస్తర్‌లో బుల్లెట్ల వర్షం

తరువాయి భాగం

జరిపాయి. కొన్ని గంటల పాటు జవాన్లు, మావోయిస్టుల మధ్య భీకరంగా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు హతం అయ్యారు. జవాన్లకు ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఘటన స్థలంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు. కాగా, 2025, జనవరి 7వ తేదీన బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి 8 మంది జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. 8 మంది జవాన్ల మృతి ప్రతీకారంగా 12 మంది మావోస్టులను మట్టుబెట్టాయి భద్రతా దళాలు.

# కేజ్రీవాల్, మోడీ దొందూ దొందే

తరువాయి భాగం

సీఎం అన్నారు. తెలంగాణలో 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు.

స్వతంత్ర భారత చరిత్రలో యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పిన మోదీ.. 10 ఏళ్లలో 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని.. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 120 కోట్ల మంది మహిళలు తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, అందుకు రూ.4 వేల కోట్లు ఆర్టీసీకి తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. 50 లక్షల మంది రూ.500 సిలిండర్ పథకం, ఉచిత విద్యుత్ కింద లబ్ది పొందుతున్నారని చెప్పారు. తాము ఎన్నికల కోసం రాజకీయం చేయబోమని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అన్నారు.

షీలా దీక్షిత్ మూడు సార్లు ఢిల్లీ సీఎంగా పని చేసి మెట్రోతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేజ్రీవాల్, షీలా దీక్షిత్ చేపట్టిన అభివృద్ధి పనులను పోల్చి చూడాలని ఢిల్లీ ప్రజలను కోరారు. తమ పార్టీ ఇచ్చిన హామీలతో ఢిల్లీలో పేద ప్రజల స్థితిగతులు మెరుగవుతాయని, ఢిల్లీలో అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేసే బాధ్యత తనదని అన్నారు. అవినీతిని నిర్మూలిస్తే హామీలను నెరవేర్చవచ్చని, తెలంగాణలో తాము కేసీఆర్ అవినీతిని నిర్మూలించి హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ పార్టీకి లోక్‌సభలో 100 మంది ఎంపీలు ఉన్నారని, ఢిల్లీ సమస్యలపై పార్లమెంటులో ఒత్తిడి తేగలమని, కేజ్రీవాల్ ఏం చేస్తారని రేవంత్ ప్రశ్నించారు.

# చంపి.. పూడ్చేసి.. సమాధిపైనే పిండి వంటలు

తరువాయి భాగం

తోడుండాల్సిన భర్త తల్లిదండ్రులతో కలిసి భార్యను ఘోరంగా హత్య చేశాడు. అనంతరం శవాన్ని ఇంట్లోనే పూడ్చి పెట్టాడు. అంతటితో ఆగకుండా ఎవరికి అనుమానం రాకుండా.. శవాన్ని పూడ్చి పెట్టిన చోటే పొయ్యి పెట్టి సంక్రాంతి పిండి వంటలు సైతం చేయించాడు. తాజాగా ఈ ఘటన వెలుగులోకి రావడంతో అంతా షాక్ అయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మహబూబాబాద్ లోని సిగ్నల్ కాలనీకి చెందిన గోపి.. నాగమణి అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత ఏడాది కాలంగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. అన్యోన్యంగానే కలిసి ఉండే వారు. కుటుంబ సభ్యులు కూడా వారితోనే ఉంటున్నారు. కానీ, గత కొంతకాలంగా నాగమణితో భర్త గోపితో పాటు ఆమె అత్త కాటి లక్ష్మి, మామ రాములు గొడవ పడుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. సుమారు వారం రోజుల క్రితం రాత్రి వేళ గొడవ జరిగిందంటున్నారు. అదే రోజు, నాగమణిని చంపేసినట్లు భావిస్తున్నారు. విషయం బయటకు తెలియకుండా భర్త, అత్తమామలతో పాటు ఆడపడుచు, ఆమె భర్త కలిసి నాగమణి శవాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టారు. ఏమీ తెలియనట్లు మామూలుగానే ఉంటున్నారు. గోపి, ఆమె తల్లిదండ్రులు, సోదరి దుర్గ, ఆమె భర్త మహెందర్ కలిసి ఇంట్లోనే సంక్రాంతి పండుగ చేసుకున్నారు. బయటి వాళ్లకు అనుమానం రాకుండా నాగమణిని చంపి పాతిపెట్టిన చోటే, పొయ్యి పెట్టి సంక్రాంతి పండుగ వంటలు కూడా చేశారు. కొద్ది రోజులుగా నాగమణి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు ఎక్కడికి వెళ్లిందని అడగడం మొదలు పెట్టారు. పండుగకు ఊరెళ్లిందని చెప్పారు. విషయం బయటకు తెలిసే అవకాశం ఉండటంతో సంక్రాంతి పండుగ తర్వాత ఇంటికి తాళం వేసి, నాగమణి భర్త, అత్తమామలు, ఆడపడుచు దంపతులు అక్కడి నుంచి పరారయ్యారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పాట్ కు చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూశారు. తాజాగా తవ్విన మట్టి నుంచి వాసన రావడంతో స్థానికుల సాయంతో మట్టి తొలగించారు. నాగమణి శవం బయట పడటంతో అందరూ షాక్ అయ్యారు. జిల్లా ఎస్పీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు.

# రూల్స్ ఎందుకు అతిక్రమించారు..?

తరువాయి భాగం

బదలాయింపు, నిధుల బదలాయింపులో ఫేమా నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించి సుదీర్ఘంగా కూపీలాగినట్లు తెలుస్తోంది. అయితే కేటీఆర్ విచారణ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా బషీర్‌బాగ్ ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 200 మంది పోలీసులు మోహరించారు. ఇక ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. వారిద్దరు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఈడీ కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కేటీఆర్ తో వారిద్దరు చేసిన వాట్సాప్ చాట్‌ను కూడా ఈడీ సేకరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆ చాట్‌ను చూపించి కేటీఆర్ పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఈడీ కేటీఆర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని ఈ రోజు ఉదయం నుంచి జోరుగా ప్రచారం సాగింది.

**లై డిటెక్టర్ పరీక్షకు నేనుసిద్ధం: కేటీఆర్**

ఏసీబీ అధికారులు అడిగిన ప్రశ్నలనే.. తాజాగా ఈడీ అధికారులు తిప్పితిప్పి అడిగారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దాదాపు 7 గంటల పాటు ఈడీ విచారణ అనంతరం కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. రేవంత్‌రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. కోర్టులు, జడ్జిలపై నమ్మకం ఉందని, న్యాయమే గెలుస్తుందని వ్యాఖ్యానించారు. తప్పు చేయలేదు.. చేయబోను. తప్పు చేశానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం అని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నాపై తప్పుడు కేసులు పెట్టారని... దర్యాప్తు సంస్థలు, విచారణ అధికారులపై ఉన్న గౌరవంతో ఏ తప్పు చేయకపోయినా ఏసీబీ, ఈడీ విచారణకు హాజరయ్యానని తెలిపారు. రెండు సంస్థలు కూడా ఒకే రకమైన ప్రశ్నలు తిప్పి తిప్పి అడిగారని... అన్నింటికీ సమాధానమిచ్చినట్లు తెలిపారు. ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తానని.. ఎన్ని ప్రశ్నలు వేసినా సమాధానాలు చెబుతానని కేటీఆర్ అన్నారు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థను తాను గౌరవిస్తానని విచారణకు పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. తనకు ఒక విషయంలో ఇబ్బందిగా ఉందన్నారు. తాను గురువారం ఉదయం పేపర్‌లో ఓ వార్త చూశానని.. ఫార్ములా ఈరేస్ కేసు విచారణకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు ఖర్చువుతుందని తెలిసిందన్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డికి ఒక మాట చెబుతున్నానని.. తనపై ఏసీబీ, ఈడీ కేసులున్నాయని.. నాపైనా పెట్టించారని తెలిపారు. మీరు దొరికిపోయారు.. నేను నిజాయతీ గల వ్యక్తిని. కేసులన్నింటినీ ఎదుర్కొంటానన్నారు. విచారణ పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయొద్దని.. ఈ డబ్బుతో ఇంకొక 500 మంది రైతులకు రుణమాఫీ చేయొచ్చని సూచించారు. న్యాయమూర్తి, మీడియా ముందు లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రాష్ట్ర ప్రజలందరూ చూస్తుండగానే విచారణ జరగాలన్నారు.

# ఇది తెలంగాణ విజయం..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కృష్ణా జలాల్లో రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటా విషయంలో తొలుత సెక్షన్ 3పైనే వాదనలు వినేందుకు జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నిర్ణయించడం తెలంగాణ విజయమని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రైబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ట్రైబ్యునల్ నిర్ణయంతో భవిష్యత్‌లో రాష్ట్రానికి కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృష్ణా, గోదావరి జలాల వాటాల కేటాయింపుల్లో జరిగిన అన్యాయమే ప్రధాన కారణం. కానీ, 2014లో తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఏపీ, తెలంగాణల మధ్య జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ పణంగా పెట్టారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ఇచ్చిన 811 టీఎంసీల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులకు కేసీఆర్ అంగీకారం తెలిపారు. అది సరైన నిర్ణయం కాదు. రాష్ట్రంలో కృష్ణా పరీవాహకం 68.5 శాతం ఉండగా ఆ మేరకు 555 టీఎంసీలు దక్కాల్సి ఉంది. రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ కాలరాశారు. కృష్ణా బేసిన్‌లో పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతలు తదితర ట్రైబ్యునల్ నుంచి నీటి కేటాయింపులు లేని అనేక ప్రాజెక్టులు ఉన్నాయి. కనీసం ఈ ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర జల సంఘం, కృష్ణా బోర్డులకు అందజేసి నీటి కేటాయింపులు దక్కేలా చేయడంలోనూ విఫలమయ్యారు. తద్వారా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# స్పేడెక్స్ డాకింగ్ సక్సెస్

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

వరుస ప్రయోగాలతో ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోసారి సత్తా చాటింది. నూతన ఏడాదిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పర్‌మెంట్ (స్పేడెక్స్) విజయవంతమైంది. నింగిలో రెండు ఉపగ్రహాల అనుసంధానం విజయవంతంగా పూర్తయింది. ఈ మేరకు ఇస్రో 'ఎక్స్'లో గురువారం వెల్లడించింది. 'అంతరిక్ష చరిత్రలో భారత్ తన పేరును లిఖించుకున్నది. గుడ్‌మార్నింగ్ ఇండియా! ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ మిషన్ డాకింగ్ విజయవంతమైంది. ఈ అద్భుతమైన క్షణాలకు సాక్ష్యంగా నిలిచినందుకు గర్వంగా ఉంది' అని ఇస్రో తెలిపింది. పోస్ట్ డాకింగ్, రెండు ఉపగ్రహాలను ఒకే వస్తువుగా నియంత్రించడం కూడా విజయవంతమైందని ఇస్రో వెల్లడించింది. అన్‌డాకింగ్, పవర్ ట్రాన్స్‌ఫర్ చెక్ చేయడం లాంటి కార్యక్రమాలను రానున్న రోజుల్లో చేపట్టనున్నట్టు ఇస్రో వెల్లడించింది. స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. ఉపగ్రహాల డాకింగ్ సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా మన దేశం అవతరించింది. నింగిలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసిన భారత్.. అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన సగర్వంగా చేరింది. గతేడాది డిసెంబర్ 30న స్పేడెక్స్ మిషన్‌ను ఇస్రో చేపట్టిన విషయం విదితమే. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ ద్వారా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే రెండు ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువుండే ఆ శాటిలైట్లతో పాటు 24 పేలోడ్‌లను కూడా పీఎస్ఎల్వీ తీసుకెళ్లింది. నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ రాకెట్ 15 నిమిషాల తర్వాత వాటిని 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జనవరి 7, 9, 11 తేదీల్లో డాకింగ్ ప్రక్రియ చేపట్టాలని ఇస్రో అనుకున్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించిన తర్వాత గురువారం రెండు ఉపగ్రహాల అనుసంధానాన్ని ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది.

# తెలంగాణ వాటా పెరుగుతుందా..?

తరువాయి భాగం

రెఫరెన్స్ ప్రకారమే విచారణ నిర్వహించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాతే ఏపీ కోరిన విధంగా రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 కింద విచారణ నిర్వహిస్తామని తెలిపింది. తెలంగాణ దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్ (ఐఏ)పై గురువారం ఢిల్లీలో విచారణ నిర్వహించిన ట్రిబ్యునల్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ట్రిబ్యునల్ విచా రణకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ట్రిబ్యు నల్ నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం ఎలా ఉండాలో నిర్ణయించే బాధ్యతను బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం అప్పగించింది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల నీటిని కేటాయించడంతోపాటు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో 150 టీఎంసీలు నిల్వ చేసుకొని క్యారీఓవర్‌గా వినియోగించుకొనే, మిగులు జలాలను వినియోగించుకొనే స్వేచ్ఛ ఇచ్చింది. పునర్విభజన చట్టం ప్రకారం బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా కేటాయింపును నిర్ధారించడం, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం ఎలా అన్నదానిపై రెండు రాష్ట్రాల మధ్య ట్రైబ్యునల్ ఎదుట పదేళ్లుగా వాదనలు జరుగుతున్నాయి. అంతర్రాష్ట్ర జలవివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం వాదనలు విని బచావత్ ట్రైబ్యునల్ చేసిన కేటాయింపులో ఎవరి వాటా ఎంత అన్నది తేల్చే పనిని కూడా బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కే అప్పగిస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ 2023 అక్టోబరు 6న తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ (టీఓఆర్) జారీ చేసింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ట్రైబ్యునల్ ఎదుట వాదనలు వినిపించాలని, అయితే తమ తుది తీర్పునకు లోబడి ట్రైబ్యునల్ నిర్ణయం ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో గత ఏడాది ట్రైబ్యునల్ ఎదుట వాదనలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89, అంతర్రాష్ట్ర జలవివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు దాఖలు చేసిన విజ్ఞప్తులు, సాక్ష్యాలు, డాక్యుమెంట్లు, రెఫరెన్స్‌లను కామన్ రికార్డుగానే పరిగణించాలని, పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89, అంతర్రాష్ట్ర జలవివాద చట్టంలోని సెక్షన్ 3ల కింద వాదనలను కలిపివినాలని కోరుతూ ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ మధ్యంతర దరఖాస్తు(ఐ.ఎ) దాఖలు చేసింది. దీన్ని ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించింది.

# బీటెక్ విద్యార్థినిపై రేప్

తరువాయి భాగం

రక్షణ కల్పిస్తున్నప్పటికీ ఏదో ఒక చోట యువతులు అత్యాచారాల బారిన పడుతూనే ఉన్నారు. ఆడపిల్లలను ఇంటి నుంచి బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో మరో దారుణం జరిగింది. కామాంధుడికి ఆగడాలకు యువతి బలైపోయింది. ఉజ్వల భవిష్యత కోసం ఇంటిని వదిలి, తల్లిదండ్రులను వదలి దూరంగా ఉంటూ చదువుతున్న బీటెక్ చదువుతున్న విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడో దుర్మార్గుడు. నగరంలోని ఇబ్రహీంపట్నంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంజనీరింగ్ విద్యార్థినిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. హాస్టల్ లో దూరి గదిలో ఒంటరిగా ఉన్న బీటెక్ విద్యార్థిపై అత్యాచారానికి పాల్పడ్డాడు డ్రైవర్. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థినిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. ఇబ్రహీంపట్నం అత్యాచార ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు తెలియజేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అత్యాచారం కేసు నమోదైందన్నారు. మధ్యాహ్నం 12:38 నిమిషాలకు డయల్ హండ్రెడ్ ద్వారా సమాచారం అందిందన్నారు.

బాధితురాలు మంగల్‌పల్లిలోని ఓ హాస్టల్లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోందని. సెమిస్టర్ ఉండటంతో హాస్టల్లో ఉంటూ ప్రిపేర్ అవుతోందని తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో బాధిత బాలిక గదిలో ఒంటరిగా ఉందని.. అదే సమయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న అజిత్ ఆమె గదిలోకి చొరబడ్డాడని తెలిపారు. బలవంతంగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడని... అనంతరం అతడు అక్కడి నుంచి పరారైనట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని... నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు నల్లగొండ జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించామని పోలీసులు పేర్కొన్నారు.



# విద్యార్థి యువ గర్జనను జయప్రదం చేయండి

- ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించి,సమాజానికి దూరం కాకండి, మాల సోదరులకు విజ్ఞప్తి
- మాదిగ జేఏసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ

కొత్తగూడెం, విశాలభారతి:

వేయి గొంతులు కాదు మాదిగలకు 12శాతం వాటనే ముద్దు అని మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు అన్నారు. గురువారం నాడు జిల్లా కేంద్రంలోని రుద్రంపూర్ డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం దగ్గర మాదిగ జే.ఏ.సి.సింగరేణి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కొండేటి షడ్రక్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డా.పిడమర్తి.రవి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ,ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో జరుగు విద్యార్థి యువ గర్జనను జయప్రదం చేయాలని కోరారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కాదు, వర్గీకరణలో మాదిగ వాటా 12శాతమే ముద్దని అన్నారు. మాల సోదరులు మీ వాటా కోసం హక్కుగా అడగండి కానీ, వ్యతిరేకించి సమాజానికి దూరం కావద్దని హితవు పలికారు. వర్గీకరణ ప్రజా ఉద్యమం కాకముందే ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకొవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జే.ఏ.సి.విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు నరాల రాజేష్, అంకుష్,మధు,యాకయ్య,సంజీవ రావు, కుమార్, కృష్ణ, అశోక్, ప్రసాద్, వెంకటస్వామి, పణి పాల్గొన్నారు.



# ఆర్ టీవీ ఫోక్ సాంగ్ యూట్యూబ్ ఛానల్ రవికి అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయం

నల్గొండ, విశాల భారతి

నల్గొండ న్యూస్ ఆర్ టీవీ ఫోక్ సాంగ్ యూట్యూబ్ ఛానల్ రవి తీవ్ర అనారోగ్యంతో గత రెండు నెలలుగా అపెండిక్స్ కడుపునొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న ఐదు రోజుల్లో తండ్రి అకాల మరణం,దానికి తోడు కడుపులో ఇన్ఫెక్షన్ తో నల్లగొండ పట్టణంలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్ మరియు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు అక్కడికి చేరుకొని పండ్లు,ఆర్థిక సహాయం చేశారు.రవి కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్ మాట్లాడుతూ రవి ఆరోగ్యంగా ఉన్న సమయంలో ఇలాంటి ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొని,స్వచ్ఛంద కార్యక్రమాలను తన వీడియో ద్వారా కవర్ చేశారన్నారు. .రవి చాకలి ఐలమ్మ పాట చిత్రీకరణ కు సహకరించారని రవితో పాటు పనిచేసిన ఎంతోమంది కళాకారులు,మీడియా మిత్రులు ఎంతో కొంత ఆర్థిక సహాయం చేసి హాస్పిటల్ బిడ్డలకు సహకరించగలరని అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్,మరియు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సురకారపు యాదగిరి గౌడ్,కంచర్ల రఘురాం రెడ్డి,పాలకూరి నరసింహ గౌడ్,దోనాల లింగారెడ్డి,కట్టెబోయిన సంజీవ యాదవ్,అయితగోని ప్రసాద్,తుపాకుల ప్రవీణ్, తుమ్మలపల్లి మహేష్,రజక సంఘం నాయకులు యలిజాల శంకర్,నడిగోటి నాగరాజు కురుమ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
17.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలేవి..?

మొదటిపేజీ తరువాయి: శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్‌ఎల్‌పీ దాఖలు చేయగా, మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పు అమలుచేయాలని కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు రాగా మేఘా అందుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని ఆరోపించింది. 4 వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది.

GENERAL NEWS



## 'ఆదర్శంగా నిలుస్తున్న పొదుపు సంఘం'

**తుర్కయంజాల్, విశాలభారతి:**

విజయదుర్గ పొదుపుసంఘం అంచెలం చెలుగా ఎదిగి వేల మంది సభ్యులు, కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం ఎంతో గర్వకారణమని ఆ సంఘం సీఈవో సంగీత అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఎన్ఎస్ఆర్‌నగర్ కాలనీలో విజయ దుర్గ పొదుపుసంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్రి మహేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగీత, సంఘ సభ్యులు మాట్లాడుతూ కేవలం పది మంది సభ్యులతో ప్రారంభమైన పొదుపు సంఘం నేడు ఈ స్థాయికి చేరడంలో సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. నెలకు కేవలం రూ.100 పొదుపుతో ఈ సంఘం నడుస్తోందన్నారు. అతి తక్కువ వడ్డీతో సభ్యులకు రూ.2లక్షల వరకు రుణాలు సంఘంలో అందిస్తుందని అన్నారు. సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. సభ్యులు చనిపోతే వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కొత్తగా చేరే సభ్యులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయదుర్గ పొదుపు సంఘం అధ్యక్షుడు గోదాసు భద్రయ్య, కార్యదర్శి ఆదిమూలం వెంకటాచారి, కోశాధికారి రాణి, సభ్యులు వట్నాల ధనుంజయగౌడ్, పొట్ల జంగయ్య గౌడ్, అంజమ్మ, పండాల కుమార్‌గౌడ్, పల్స హారిక, రాజుగౌడ్, గానుగు యాదగిరి, డిల్లి జగన్, పల్లె కుమార్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

**సూర్యాపేట, విశాల భారతి**

మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఈనాడు ఆఫీస్ వద్ద రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగా వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ అనేక చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానా తప్పదు అని హెచ్చరించారు. మద్యం సేవించిన కేసులు పునరావృతం అయితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఝాన్సీ రెడ్డి

**దేవరుప్పల, విశాల భారతి**

పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి దేవరుప్పుల మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తూ వారికి చేయూతగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మండల ప్రముఖులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాల్లు, తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు మద్దతు అందించేందుకు వారు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.



## గీత కార్మికున్ని పరామర్శించిన సంఘ నాయకులు

- తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు సాంబయ్య

**భీమదేవరపల్లి, విశాల భారతి :**

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాసగోని శ్రీనివాస్ గౌడ్ వృత్తి నిర్వహణలో భాగంగా సోమవారం తాడి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్ ను తక్షణమే ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. గాయపడిన గీతా కార్మికునికి తక్షణమే ఎక్స్గ్రేషియా చెల్లించాలని జిల్లా కల్లు గీతా కార్మిక సంఘం అధ్యక్షులు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, బుర్ర శ్రీనివాస్ గౌడ్ , మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సదానందం గౌడ్, ఎల్కతుర్తి మండల అధ్యక్షులు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, హసన్ పర్తి మండల అధ్యక్షులు మోటపోతుల రాజు గౌడ్ లు పరామర్శించారు.

# ఢిల్లీ గడ్డపై ఎల్లబోతారం డప్పుల మోత

- తప్పు కళాకారులకు ఘన సన్మానం.

**సైదాపూర్ ,విశాలభారతి;**





సైదాపూర్ మండల్ ఎల్లబోతారం గ్రామానికి చెందిన ప్రముఖ డప్పు కళాబృందం ఎన్నో ఏళ్లుగా వివిధ రాష్ట్రాలలో డప్పు ప్రదర్శనలు ఇచ్చి దాదాపు 40 సంవత్సరాల నుండి ఆనాటి ఇందిరాగాంధీ నుండి ఈనాటి నరేంద్రమోడీ వరకు డప్పునృత్య కల తో మేపించి దేశ నలుమూలల ప్రదర్శనలు ఇచ్చిన ఘనత ఎలా పోతారం డప్పు కళాకారులకు ఉన్న సంగతి తెలిసిందే. 2025 సంవత్సరం పొంగల్ ఫెస్టివల్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల తమ తమ కలలను భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు మరియు కేంద్ర మంత్రులు ఎంపీల సమక్షంలోకళ ప్రదర్శనలు ఇవ్వడం జరిగినది.అందులో భాగంగా మన తెలంగాణ రాష్ట్రం నుండి ఎలబోతారం గ్రామం నుండి నమిండ్ల బాబు డప్పు కళాబృందం పాల్గొని డప్పు నాట్య కల ప్రదర్శనలు ఇచ్చిరు అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీగారు డప్పు కళాకారుడు బాబుకు చేతిలో చెయ్ కలుపుతూ తనను తనబృందని అభినందించారు.నేడు స్వరాష్ట్రానికి తిరిగి వచ్చిన నమిండ్ల బాబు మరియు తన బృందం సభ్యులు. నమ్మిన సంపత్, కిరణ్,సమ్మయ్య,హరీష్, తిరుమలేష్, సతీష్, అంజలి, కోమల, ప్రవళిక, కళాకారులందరినీ ఎలా పోతారం గ్రామంలో మాజీ సర్పంచ్ శిరీష ముకుంద రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావుల వేణు మారబోయిన వేణు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ యోగా టీం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**బాల్కొండ, విశాల భారతి**

భీమ్‌గల్ యోగ టీం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సయ్య,జలజ,యోగ గురూజీ అనంతరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టతను వివరించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యోగ గురూజీ అనంతరావు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ముగ్గుల పోటీల్లో మైనారిటీ యువతులు పాల్గొనడం ఆనందం ఇచ్చిందన్నారు. మహిళలు ముగ్గుల పోటీలలో దేశభక్తిని చూపుతూ యెగ,సంస్కృతి,సంప్రదాయా లను ఉద్దేశించి వేసిన ముగ్గులు ఆకర్షించాయని తెలిపారు.యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాంను పొందవచ్చు అని సూచించారు.యోగ టీం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేటి యువతకు సంస్కృతి,సంప్రదాయాలు తెలియ చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు యోగ టీం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం పోటిలో గెలిచిన విజేతలు కాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన లాస్య,తోపారం సంతోషిని, పిల్లోళ్ల రవళి,చిన్న పిల్లల్లో నుండి మంచిర్యాల వసంత,మంతెన హర్షిని, రింశా (మైనారిటీ )లకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు. ఈ జవ్వాజి భూమయ్య, శివకుమార్, జె.జె నర్సయ్య, రమేష్,శ్రీధర్, గణేష్,పురస్తు లింబాద్రి,బాపురావు,నవీన్,సురేందర్, చారి,శ్రీనివాస్, భూపాల్,గోవర్ధన్,శ్యామ్,మాజీ సర్పంచ్ ప్రవీణ్,గ్రామ కమిటీ అధ్యక్షుడు సేవ్వ అశోక్,వాకా మహేష్, బిజెపి నాయకులు ఆరే రవీందర్, యోగేశ్వర నర్సయ్య,మధు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద గట్టు అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలి

- పెద్ద గట్టు దేవస్థానం అభివృద్ధి చేసిన ఘనత రాంరెడ్డి దామోదర్ రెడ్డి దే
- ఏఐ సిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
- పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణా రెడ్డి

**సూర్యాపేట, విశాల భారతి**

పెద్ద గట్టు దేవస్థానం అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని, జాతర ప్రాముఖ్యతను కాపాడేందుకు అందరూ కృషి చేయాలని ఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణా రెడ్డి అన్నారు. గురువారం దురాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి దేవస్థానం నూతన కమిటి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుండి పెద్ద గట్టు జాతరకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం ఎర్పాటైన కమిటి జాతర కోసం ఏర్పడ్డ కమిటీ కాదని పూర్తిస్థాయిలో పెద్దగట్టు అభివృద్ధి కోసం ఏర్పడ్డ కమిటీ అని పేర్కొన్నారు. పెద్ద గట్టు వద్ద ప్రతి పౌర్ణమికి భక్తులు ఉండేందుకు వసతి ఏర్పాటు చేయాలన్నారు. పెద్దగట్టు లింగమంతుల స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాంరెడ్డి దామోదర్ రెడ్డికే దక్కిందన్నారు. పెద్ద గట్టు వద్ద సిసి రోడ్లు, హాల్ నిర్మాణం రాంరెడ్డి దామోదర్ రెడ్డి హయాంలోనే జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్దగట్టుకు నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు జీరో బ్యాలెన్స్ ఉండటం దురదృష్టకరమైన అంశమన్నారు. శిలా పలకాలకు పార్టీ రంగులను వేసిన ఘనత గత పాలకులు చేసింద్రని విమర్శించారు. అనంతరం పెద్దగట్టు దేవాలయ లింగమంతుల స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గా పోలేబోయిన నరసయ్య యాదవ్, వైస్ చైర్మెన్ గా పోలేబోయిన నరేష్ పిళ్లే, కమిటీ సభ్యులుగా కుర్ర సైదులు, వీరబోయిన సైదులు, సిరపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

# క్రీడలతోనే మానసిక ప్రశాంతత

- గ్రామంలో పండుగలా ఆటల పోటీలు
- క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి
- ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**





ఉరుకులు, పరుగుల ప్రస్తుత సమాజంలో క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సీనియర్ క్రీడాకారులు జెనిగే శ్రీశైలం, బండి సర్దార్ అన్నారు. యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ క్రీడోత్సవాలు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. హోరాహోరీగా సాగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ లో బెంగాల్ టైగర్స్ జట్టు , రైజింగ్ స్టార్స్ జట్లు పాల్గొనగా బెంగాల్ టైగర్స్ జట్టు రైజింగ్ స్టార్స్ జట్టుపై సునాసాయంగా విజయం సాధించింది. విజేతలకు నగదుతో పాటుగా ట్రోఫీ అందించారు. టోర్నమెంట్ ప్రథమ బహుమతి జెనిగే శ్రీశైలం రూ. 15 వేలు , ద్వితీయ బహుమతి గ్రామ పోలీస్ ఆర్గనైజర్ టీమ్ రూ. 10 వేలు , తృతీయ బహుమతి బండి సర్దార్ రూ. 5 వేలు అందించారు. తృతీయ బహుమతి ఛాంపియన్స్ జట్టుకు వరించింది. ఈ సందర్భంగా జెనిగే శ్రీశైలం, బండి సర్దార్ మాట్లాడుతూ నిత్య వివిధ పని ఒత్తిడికి గురవుతున్న తరుణంలో కొంత సమయం క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆరోగ్యపరంగా ఎంతో దృఢంగా ఉంటామని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలలోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలిపారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జే.రమేష్ , కే. కృష్ణ , శ్రీనివాస్ , వెంకటేష్ , శ్రావణ్, మహేందర్ , జే. యాదగిరి గోరటి సత్యనారాయణ , నాగరాజు ,గౌర శ్రీనివాస్ ,మొర్రి పాండు తదితరులు పాల్గొన్నారు

## 19న ఆర్టీఏ ఆఫీసులో వాహనాల వేలం



**తుర్కయంజాల్, విశాలభారతి:**

వివిధ కారణాల వల్ల సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 19న వేలం వేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్‌చంద్రారెడ్డి తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడలో ఉన్న ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఆదివారం రోజున ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని ఆర్టీవో సూచించారు. వేలంలో పాల్గొనేవారు రూ.500 దరఖాస్తు రుసుము, రూ.2వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.



## బ్రహ్మోత్సవాలలో కోడె మొక్కులు చెల్లించుకున్న సీఐ దంపతులు

**భీమదేవరపల్లి, విశాల భారతి :**

బ్రహ్మోత్సవాలలో భాగంగా కొత్తకొండ వీరభద్రుని సన్నిధిలో కుటుంబ సభ్యులతో కలిసి సిఐ పులి రమేష్ దంపతులు భద్రకాళీ సమేత వీరభద్రున్ని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో కొలువుదీరిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారికి కుంకుమార్చన, దేవస్థానం తరపున శేష వస్త్రము స్వామివారి చిత్రపటంతో దంపతులను ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించారు.

## కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్న సుభాష్

**భీమదేవరపల్లి, విశాల భారతి :**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని ప్రముఖ సంఘ సేవకులు, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత, బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్ర బోస్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, శ్రీ వీరభద్ర స్వామి దర్శనం మహాభాగ్యమని అని అన్నారు. రాష్ట్రంలో చదువుతున్న చిన్నారి బాల, బాలికలు విద్యా రంగంలో రాణించాలని, శ్రీ వీరభద్ర స్వామి చూపు రైతన్నలు పాడిపంటలతో విలజిల్లాలని వేడుకున్నారు. వారి వెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల ఐలేష్ యాదవ్, సంకల్ప సంస్థ కోఆర్డినేటర్ కంకటి వెంకటేష్ గౌడ్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హన్మకొండలో వేల గొంతులు లక్ష డప్పుల సన్నాహక భారీ ప్రదర్శన

- ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరిని గుండెల్లో దాచుకుంటాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ



**ఎల్కతుర్తి, విశాల భారతి :**

ఈ నెల 20వ తేదీన హనుమకొండలో భారీ స్థాయిలో నిర్వహించబోతున్న వేల గొంతులు లక్షల డప్పుల సన్నాహక మహా ప్రదర్శనకు ప్రతి గ్రామం నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వేలాది డప్పులతో విజయవంతం చేయలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈర రమేష్ మాదిగ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గద్దల సుకుమార్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీలలో ఉమ్మడి రిజర్వేషన్ విధానం అమలు కావడం వల్ల ఒక్క మాల కులం మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కానీ ఎస్సీ వర్గీకరణ అమలు జరిగితే ఎస్సీలలో 59 కులాలు అభివృద్ధి చెందుతారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేవలం ఒక్క మాల కులంలోని స్వార్థపరులే వ్యతిరేకం తప్ప సమాజం మొత్తం అంగీకరిస్తుందని అన్నారు. సమాజంలో అన్ని కులాలు అన్ని వర్గాల ప్రజలు ఎస్సీ వర్గీకరణను కోరుతున్నారని, వారిని దుషించి మాలలు సమాజంలో ఒంటరిగా మిగిలిపోవద్దని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో బూతులు మాట్లాడి, అసభ్య పదజాలంతో దూషించి, అనాగరిక పద్ధతులు అవలంభించి ఎస్సీ వర్గీకరణను బలపరిచే శక్తులను అడ్డుకోలేరని అన్నారు. ఎస్సీ వర్గీకరణను బలపరుస్తున్న డా. పృథ్వీ రాజ్ యాదవ్, విమలక్క, తెలంగాణ విఠల్, ఇస్మాయిల్, దరువు అంజన్న, రేలారే గంగా, నల్లగొండ గద్దర్ మొదలగు నాయకులను మాదిగ జాతి గుండెల్లో పెట్టుకుంటుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కాకుండా జరుగుతున్న ఈ ఘోరమైన కుట్రలను ఎదుర్కోవడం కోసమే ఫిబ్రవరి 7 న హైదరాబాద్ లో వేల గొంతులు లక్షల డప్పుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. దాన్ని జయప్రదం చేయడం కోసమే ఈ నెల 20 న హనుమకొండలో వేలాది డప్పులతో సన్నాహక మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాది రిజర్వేషన్ పోరాట సమితి అధినేత మంద కృష్ణ మాదిగ, గౌరవ అతిథులుగా ఎస్టీ,బీసీ, ఓసి, మైనార్టీ,ఎస్సీ కుల సంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుండి అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు ఈర రమేష్ మాదిగ మండల కార్యదర్శి ఎల్తూరి సురేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ హనుమకొండ మండల అధ్యక్షులు బొక్క రాజేష్ మాదిగ మండల ప్రధాన కార్యదర్శి సిలువేరు బిక్షపతి మాదిగ డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులు ఆలువాల ఏళ్ళేశ్ మాదిగ ఎర్ర రాము మాదిగ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పోగుల రమేష్ మాదిగ వినయ్ కుమార్ మాదిగ మారేపెల్లి అనూరుద్ మాదిగ పోగుల చిరంజీవి మాదిగ సంద్ర పవన్ మాదిగ జూపాక ప్రశాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు..



## కాల్వలో కనిపించని ఎస్సారెస్పీ నీళ్లు

- కాల్వలో దిగి ధర్నా చేసిన రైతులు
- హామీలు గాలికి వదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బిఆర్ఎస్ నాయకులు గాడుదుల లింగరాజుయాదవ్

**నూతనకల్, విశాలభారతి:**

కాలువ నీళ్లు రాకపోవడంతో 69 డిబి కాలువలోకి దిగి ధర్నా నిర్వహించిన ఎర్రపహాడ్ గ్రామ రైతులు. సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు గాడిదల లింగరాజు యాదవ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పుడు ఎడారిగా మారిన తుంగతుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ కృషితో తుంగతుర్తి నియోజకవర్గాన్ని ఎస్సారెస్పీ కాలువల నీటి ద్వారా సస్యశ్యామలం చేశాడని తెలిపారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గుప్పడి నీళ్లను కూడా అందించలేని స్థితిలో ఉన్నది అని అన్నారు.గత ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ అన్ని దొంగ హామీలు ఇచ్చి రైతులను రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది అని అధికారంలోకి వచ్చిన కానుండి ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ఇప్పటి వరక ఎస్సారెస్పీ కాలువలను పట్టించుకునే నాధుడే కరువాయాడని అన్నారు.ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు రాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి రైతులకు సాగునీరు అందించేలాగా చూడాలని లేనియెడల మండల స్థాయిలో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు , ఈ కార్యక్రమంలో యర్రపహాడ్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుగు అంజయ్య మాజీ వార్డ్ నెంబర్స్ నారాయణ, అనిల్ లింగయ్య రామస్వామి , రైతులు మల్లయ్య, వెంకన్న, బిక్షం, అశోక్, శీను మధు , లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుంది

- ఎమ్మెల్యే మందుల సామేలు

**శాలిగౌరారం, విశాలభారతి:**

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. ఈ సందర్భంగా గురువారం కట్టంగూరు మండలం ఐటిపాముల నుండి శాలిగౌరారం మండలంలోని వల్లాల ,పెర్క కొండరాం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ ను 100 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న పైపులైను ను వల్లాల గ్రామ శివారులో పరిశీలించారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ తో వల్లాల గ్రామంలో 1529 ఎకరాలు,పెర్క కొండారంలో 800 ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. కాలువల ద్వారా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు, ఐదు నెలలు ఈ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో కాలువల ద్వారా అమ్మనబోలు,ఎన్.జి కొత్తపల్లి నుండి శాలిగౌరారం ప్రాజెక్టులోకి కూడా నీరు తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లాలో ఎక్కడలేని విధంగా ప్రాజెక్టు ద్వారా కాల్వలతో నీరు వ్యవసాయ భూములకు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఎఇ రాజశేఖర్ రెడ్డి, శాలిగౌరారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమరం రెడ్డి, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్.కె ఇంతియాజ్, భూపతి మంగమ్మ వెంకన్న, బొమ్మగాని రవి తదితరులు పాల్గొన్నారు.



## తుదిదశకు చేరిన యూసుఫ్ కప్

**బూర్గంపాడు, విశాలభారతి:**

మండల కేంద్రంలో గత 17 సంవత్సరాలుగా మిత్రుని జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్నటువంటి యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్ లు సెమీఫైనల్స్ కు చేరాయి శుక్రవారం నాడు 2 సెమీ ఫైనల్స్ మ్యాచులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రోజున మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచులో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన స్కై లెవెన్ బూర్గంపాడు జట్టు 12 ఓవర్లకు గాను 5 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది 75 పరుగుల విజయ లక్ష్యంతో చాటింగ్ చేసిన మనీ ఎలెవన్ జట్టు 11.4 ఓవర్ లలో ఐదు వికెట్ల నష్టపోయి 75 పరుగులు చేసి విజయం సాధించింది బ్యాటింగ్ లో 16 పరుగులు చేసి బౌలింగ్ లో 2 వికెట్లు తీసిన మనీ ఎలెవన్ ఆటగాడు సిద్దు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గెలుచుకున్నాడు. రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసినటువంటి గుంటుపల్లి 11 సారపాక జట్టు నిర్ణీత 12 ఓవర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 113 భారీ పరుగులు చేసింది 114 పరుగుల విజయ లక్ష్యం తో బ్యాటింగ్ అనిల్ ఎలెవన్ భద్రాచలం జట్టు చేజింగ్ లో 12 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసి ఓటమి చెందింది బ్యాటింగ్లో 18 బంతుల్లో 33 పరుగులు చేసిన భద్రాచలం ప్లేయర్ భరత్ మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. మూడవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన ఫరీద్ లేవన్ కొత్తగూడెం జట్టు నిర్ణీత 12 ఓవర్ గాను 85 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది 86 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన న్యూస్ స్టార్స్ కొత్తగూడెం జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్ట పోయి 82 పరుగులు చేసి ఓటమి చెందింది బ్యాటింగ్లో 17 పరుగులు చేసి బౌలింగ్లో 2 వికెట్లు తీసిన కొత్తగూడెం నాగేంద్ర మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.



## కుట్టు మిషన్ లు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**కాప్రా, విశాలభారతి:**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక ఏరియాలో రోటరీ క్లబ్ కంపెనీలో ప్రముఖ పారిశ్రామిక వేత్త బబ్బురి బాలరాజు గౌడ్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 20 మంది మహిళల కు కుట్టు మిషన్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. మహిళకు ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత మావోయిస్టు కమిటీ సభ్యురాలు లొంగుబాటు

**కొత్తగూడెం, విశాలభారతి:**



నిషేదిత సీపిఐ మావోయిస్ట్ పార్టీ కేర్లపాల్ ధర్బా డివిజినల్ కమిటీ, చత్తీస్ఘడ్ ఏరియా కమిటీ సభ్యురాలయిన కలుము పాయికి తండ్రి మడా, 28 సం, పాల్యా గ్రామం, పుల్బగాడె పోలీస్ స్టేషన్ పరిధి సుక్మా, జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట గురువారం నాడు స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ విలేకరుల సమావేశంలో సభ్యురాలు వివరాలు వెల్లడించారు. కలుము పాయికి 2009వ సంవత్సరంలో కేర్లపాల్ ఏరియా కమిటీలోని ములేర్ ఆర్ పి సి నందు మిలిషియా సభ్యురాలిగా నిషేదిత సీపీఐ మావోయిస్ట్ పార్టీలో చేరి,2012 సంవత్సరంలో కేర్లపాల్ ఏరియా కమిటీ సభ్యుడు, ఎల్ ఓ ఎస్ కమాండర్ అయిన రమేష్ ఆధ్వర్యంలో ధళ సభ్యురాలిగా పదోన్నతి పొంది 2015 జూన్ నెల వరకు అక్కడ పనిచేసిందన్నారు . అనంతరం కేర్లపాల్ ఎల్ ఓ ఎస్ డిప్యూటీ కమాండర్ గా 2017 వరకు పనిచేసారు. అనంతరం కేర్లపాల్ ఎల్ ఓ ఎస్ జన్ మిలీషియా కమాండర్ గా పనిచేసింది అని చెప్పారు. అనంతరం 2020 లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది మిలీషియా కమాండర్ ఎన్నికయ్యారు. కలుము పాయికి జూన్ 2021లో కేర్లపాల్ ఏరియా కమిటీ సభ్యుడైన మడవి భీమా మోహన్ ను డివిజినల్ కమిటీ సభ్యుడైన జగ్గూ ఆద్వర్యంలో గొంగే అటవీ ప్రాంతంలో వివాహం చేసుకోవడమైనది. అగ్రనాయకుల ఆదేశాల మేరకు పలు విధ్వంసకర ఘటనలలో పాల్గొన్నారు. ఈమెపై 04 లక్షల రూపాయల రివార్డ్ కలదు. గత కొన్ని రోజులుగా మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనలు మరియు తాను పనిచేసే ప్రాంతంలో కొత్తగా పోలీస్ క్యాంపుల ఏర్పాటు చేయడంతో పాటు తన ఆరోగ్యం సహకరించకపోవడం, తమ స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు తమపై చూపుతున్న వివక్షను గ్రహించి మావోయిస్ట్ పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోయింది అని ఆయన అన్నారు.




# అజిత్ 'విడాముయర్చి' తెలుగు టైటిల్ ఇదే.!

మిళ అగ్ర నటుడు అజిత్ ప్రస్తుతం కార్ రేసింగ్ పోటీల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా దుబాయ్‌లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది అజిత్ రేసింగ్ జట్టు. దీంతో నటుడిగానే కాకుండా రేసర్‌గా రాణించిన అజిత్‌పై ప్రశంసలు కురిపించారు ప్రముఖులు.ఇదిలావుంటే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి . ఏకే 62గా వస్తున్న ఈ సినిమాకు మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాను తెలుగులో పట్టుదల పేరుతో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ని నేడు 6.40 నిమిషాలకి జెమిని టీవీ వేదికగా లాంఛ్ చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఎంత వాడు గాని తర్వాత అజిత్ త్రిష కాంబినేషన్‌లో ఈ సినిమా రానుండటంతో మూవీ భారీ అంచనాలు ఉన్నాయి.

## లోకేష్ కనగరాజ్‌తో ఆమీర్ ఖాన్ మూవీ.?

బాలీవుడ్ ఖాన్‌లంతా మళ్లీ సౌత్ బాట పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షారుఖ్ ఖాన్ అట్లీతో కలిసి జవాన్‌తో బ్లాక్ బస్టర్ అందుకోగా.. కండలవీరుడు సల్మాన్ ఖాన్ మురుగుదాస్‌తో కలిసి సికిందర్ అనే మూవీ చేస్తున్నాడు. అయితే ఈ లిస్ట్‌లోకి మరో ఖాన్ రాబోతున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ మళ్లీ సౌత్ దర్శకుడితో చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకీ ఆ దర్శకుడు ఎవరో కాదు. ఖైదీ, విక్రమ్, మాస్టర్, లియో లాంటి బ్లాక్ బస్టర్‌లు అందుకున్న తమిళ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్.ఆమీర్ ఖాన్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ లోకేష్ కనగరాజ్‌తో చేయబోతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ కన్‌ఫర్మ్ అయినట్లు తెలుస్తుంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగతా వివరాలను చిత్రబృందం వెల్లడించనున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ నిర్మించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రాజెక్ట్‌కి మాయావి అనే టైటిల్ అనుకుంటుండగా ఇందులో అమీర్ సూపర్ హీరో పాత్రలో నటించనున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని 2027 క్రిస్మస్‌కి తీసుకురాబోతున్నారు.ఇక ఆమీర్ ఖాన్ ప్రస్తుతం తారే జమీన్ పర్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్నా సితారే జమీన్ పర్ అనే సినిమాలో నటిస్తుండగా.. లోకేష్ కనగరాజ్ రజినికాంత్‌తో కలిసి కూలీ అనే సినిమా షూటింగ్‌లో బిజీ ఉన్నాడు.





## నారీ నారీ నడుమ మురారి

హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రానికి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. శర్వానంద్ నటిస్తున్న 37వ చిత్రమిది. సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను అగ్ర నటులు బాలకృష్ణ, రామ్‌చరణ్ విడుదల చేశారు. 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. శర్వానంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు. సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్, కథ: భాను భోగవరపు, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థలు: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.



## తమిళ, కన్నడలో అవకాశాలు

'బేబీ' చిత్రం కథానాయిక వైష్ణవి చైతన్య కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ కథాబలమున్న చిత్రాలనే అంగీకరిస్తున్నది వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' చిత్రంలో నటిస్తున్నది. మరికొన్ని పెద్ద చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరికి తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా భారీ ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది.అక్కడ రెండు చిత్రాలకు ఆమె సైన్ చేశారని సమాచారం. ఈ ఏడాది తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నది వైష్ణవి చైతన్య. సోషల్‌మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకుంటుంది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కొత్త ఏడాది నటిగా తనను మరో మెట్టెక్కిస్తుందనే నమ్మకంతో ఉంది వైష్ణవి చైతన్య.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.